స్కెచ్

# పెళ్ళిపిలుపు

"అంపేరాయని"

మధ్యాహ్నం రెండుగంటల సమయం. జనవరి నెల అయినా ఎండ తీక్ష్ణంగా ఉంది. ఒక్కొక్కసారి గాలి విసురుగా వీచి రోడ్డుమీది దుమ్ము నంతా ఇంట్లోకి చిమ్ముతోంది. అమ్మా, నేనూ చిట్టిచెల్లాయి నట్టింట్లో చాపమీద పడుకుని ఉన్నాం. అన్నయ్య టేబుల్ ముందు కుర్చీలో కూర్చుని వీధిలోకి చూస్తూ ఏమిటో రాసుకుంటు న్నాడు. నాన్నగారు ఆఫీసుకి వెళ్ళారు. ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించి ఉంది.

ఇంతలో ఎర్రసైకిలుమీద టెలిగ్రాఫ్ మెసింజర్ వచ్చి వీధిగుమ్మంముందు సైకిలు ఆపి, ఇంట్లోకివస్తూ 'టెలిగ్రామ్ సార్!' అన్నాడు.

అన్నయ్య అదిరిపడి కుర్చీలోంచి లేచి బయటి వరాండాలోకి వెళ్ళి, సంతకం చేసి అతన్ని పంపించేసి కవరు చించి చదువుతూ లోపలికి వచ్చాడు.

"ఎక్కణ్ణుంచిరా, ఏవిట్రా!" అంది అమ్మ తుళ్ళిపడి లేచి కూచుని.

"ఆఁ, ఏంవీలేదమ్మా. నెల్లూర్నుంచి అత్తయ్య వస్తోంది" అన్నాడు అన్నయ్య, టెలిగ్రాం మడిచి చేతులో పట్టుకుని.

"అంతేకదా. ఎప్పుడు!" అంది అమ్మ తమాయించుకుని.

"ఈ సాయంత్రం అయిదుగంటల బండికే. వచ్చి స్టేషనులో కలుసుకోమని మావయ్య టెలిగ్రామ్ ఇచ్చాడు."

"ఇన్నాళ్ళ నుంచీ ఒక్క ఉత్తరం ముక్కయినా రాయనివాళ్ళు ఇలా అకస్మాత్తుగా మనుషులే బయల్దేరి వస్తున్నారెందుకో" అని అలా రావటానికి ఏదో బలమైన కారణం ఉందన్నట్టుగా అన్నయ్య వేపు చూసింది అమ్మ. అన్నయ్య నన్ను చూసి—

"అమ్మా అత్తయ్య ఇలా రావటానికి కారణం చెల్లాయేనే మరే..." అని ఇంకా ఏదో అనబోయాడు. అంతలో నేను అన్నయ్య మాటలకి అడ్డు తగులుతూ—

"కాదమ్మా అన్నయ్యే!" అన్నాను.

"ఏవిట్రా మీ గొడవ? నాకేమీ అర్థమవటం లేదు." అంది అమ్మ తల పట్టుకుని విసుగ్గా.

"చెల్లాయి నడగటానికి వస్తోందేమోనే అత్తయ్య!" అన్నాడు అన్నయ్య నావేపు చూసి నవ్వుతూ.

"కాదే అమ్మా! పార్వతి పెండ్లికి అన్నయ్య సంబంధం నిశ్చయపరుచుకోటానికి వస్తోందేమోనే" అన్నాను అన్నయ్యవేపు కొంటెగాచూసి నవ్వుతూ.

అమ్మ అప్పటికి అంతా పూర్తిగా అర్థమైనట్టు తలపంకించి "ఓరి మీ బుద్ధి బండలవ్వా. అదిట్రా మీ ఉద్దేశ్యం. ఇంకా ఆ ఆశలు పెట్టు కూర్చున్నారూ. సరేకాని వెంట ఎవరైనా వస్తున్నారా?" అన్నదమ్మ.

"వస్తే టెలిగ్రామ్ ఎందుకిస్తారూ!" అన్నాను.

"లేదమ్మా శేఖరం బావ వస్తున్నాడట" అని అమ్మతో అనేసి, తను ఊహించిన భావాలు నాలో కనబడుతున్నాయా, లేదా అన్నట్టుగా నావేపు చూశాడు.

"ఫో అన్నయ్యా అన్నీ అబద్ధాలే" అంటూ చాచిన చేతులు వెనక్కు తీసుకున్నాను. అన్నయ్య నవ్వుతూ నిలబడ్డాడు.

"నీకు మాత్రం పార్వతి ఇక్కడికి రావాలని లేదేవిటి" అంటూ లేచి నిలబడి—'ఈ కబుర్లేనా ఆఫీసుకు వెళ్ళి మీనాన్నగారికి ఈ విషయం చెప్పేదేమైనా ఉందా' అంది.

"ఇదుగో వెళ్తున్నానమ్మా తల్లీ!" అంటూ అన్నయ్య బట్టలు వేసుకుని బైటికి వెళ్ళిపోయాడు.

• • •

సాయంకాలం అరయ్యే సరికల్లా నాన్నా అన్నయ్యా అత్తయ్యను తీసుకుని వచ్చారు

అత్తయ్య ఒక్కతే వొచ్చింది. చిరునవ్వు నవ్వుతూ ఇంట్లో ప్రవేశించింది. అమ్మ క్షేమసమాచారాలు అడిగి తెలుసుకుంది. భోజనాలు అయ్యేక పడుకున్నప్పుడు అత్తయ్య నడిగింది అమ్మ—'పిల్లలు బాగా చదువుకొంటున్నారా?' అని.

“ఆ!” అని సమాధానం చెప్పి—'శంకరానికి ఈయేటితో బి. ఏ. అయిపోతుందనుకుంటాను. అదయ్యాక వాణ్ణింకా పైకి...చదివించ దల్చుకున్నారా?' అనడిగింది అత్తయ్య.

“లేదమ్మా ఒదినా అంతటితో ఆపెయ్యదల్చుకున్నారు. పిల్ల...కూడా పెళ్ళీడుకొచ్చిందా, వాడికీ దీనికీ ఒక్కసారే పెళ్ళిళ్ళు చేసేసి వాణ్ణి కాస్తా ఉద్యోగంలో చేర్పాలనుకుంటున్నారు.” అని వెల్లికిలా పడుకుని మాటాడుతున్నదల్లా ఒత్తిగిలి పడుకుని అత్తయ్యవేపు చూస్తూ—'ఈమధ్య ఏవేవో సమ్మంధాలు వచ్చాయి. కాని మా చెల్లెలి పిల్లలున్నారు అని వారే తిరగ్గొట్టారు”అంది అమ్మ.

అత్తయ్య అమ్మమాటలు సరిగా ఆలకించనట్లుగా ప్రవర్తించి విషయం మార్చేసి చెల్లాయిని దగ్గరకు తీసుకుని ఏవిఁటేవిఁటో...మాటాడింది.

ఏడెనిమిది సంవత్సరాల క్రితం నాన్నా మావయ్యా కలిసి నెల్లూరులో అభ్రకం వ్యాపారము చేశారు. ఆ వ్యాపారంలో లాభాలు రాకపోగా విపరీతంగా నష్టం వచ్చింది. అంతటితో వ్యాపారానికి స్వస్తిచెప్పి నాన్నగారు ఉద్యోగం మీద విజయవాడ వచ్చేశారు. మేమేమీ ఎరుగనట్లు అవన్నీ చెప్పింది. ఇప్పుడు వ్యాపారం ఇంతకంటే అధ్వాన్నంగా ఉన్నదంది. వాళ్ళంతా వ్యాపారం అనే ఊబిలో దిగబడిపోయినట్లూ, మేం ఆ ఊబిలోంచి తెలివిగా తప్పించుకు బయటపడి బాగుపడినట్లూ మాటాడింది.

• • •

ఖ్యమైన విషయమొకటి నీతో మాటాడు 'మని వచ్చానన్నయ్యా!” ప్రొద్దున్నే కాఫీతీసుకున్నపుడు నాన్నతో అంది అత్తయ్య.

“ఏవిటమ్మా అది” అన్నారు నాన్న.

“అప్పుడు వారూ నువ్వూ కలిసి నెల్లూరులో వ్యాపారంచేసినప్పుడు పెట్టుబడిగ్గాను నీకు కొంత డబ్బిచ్చారుటగా. ఆయనకిప్పుడు పైకం అవసరంగా కావాలిట.అదివ్వగలవేమో అడిగిపట్రమ్మన్నారు.”

ఈ మాట లంటున్నప్పుడు అత్తయ్య నాన్న ముఖంలోకి తిన్నగా చూడలేకపోయింది. ఎడం చేత్తో కాఫీగ్లాసు పట్టుకుని కుడిచేత్తో ఎదురుగా వున్న టేబుల్ పైన సున్నలుచుడుతూ క్రమంగా తలదించి క్షణంసేపు చూపులు అటువేపే కేంద్రీకరించింది. తరువాత తెల్లపడిన ముఖాన్ని పైకెత్తి 'ఏమంటావ్?' అన్నట్టు నాన్న వేపు చూసింది.

“ఇప్పుడింత అర్జంటుగా నాకుమట్టుకు డబ్బెక్కణ్ణుంచి వస్తుందమ్మాయ్? ఏదో ఆ చిన్న ఉద్యోగమూ, ఈ చిన్న ఇల్లూ ఉన్నాయి కాబట్టి సంసారంలో ఎలాగో నెట్టుకొస్తున్నాను.” అన్నారు నాన్న.

“మాకుమాత్రం తెలీదా అన్నాయ్! ఎవరి ఇబ్బందులు వాళ్ళకుంటాయి. ఇన్నాళ్ళనించీ నిన్నొక దమ్మిడీ ఇవ్వమని వారడిగారా? అవసరమొచ్చింది కాబట్టి ఇప్పుడైనా అడుగుతున్నారు. ఎక్కడైనా అప్పుగానైనా తీసుకొచ్చి మాకీ అవసరం తీర్చక తప్పదన్నాయ్!” అంది అత్తయ్య బ్రతిమాలుతున్న ధోరణిలో.

“సరే చూస్తాను” అని నాన్నగారు సరియైన సమాధానం చెప్పకండా ఆఫీసుకు వెళ్ళిపోయారు.

ఎక్కణ్ణుంచి తెచ్చారో పదిహేనువేల రూపాయలకి ఓ చెక్కు తీసుకొచ్చి ఆ సాయంకాలానికల్లా అత్తయ్యచేతి కందించారు నాన్నగారు. నాలుగురోజులు ఉండమని ఎంత బతిమాలినా వినకండా, అత్తయ్య ఆ రాత్రి బండికే నెల్లూరు వెళ్ళి పోయింది.

అత్తయ్య వెళ్ళిన మరుసటిరోజు మొదలుకుని రెండురోజులు నాన్నగారు ఇంట్లో సామాన్లన్నీ పార్సెల్ చేయించారు. ఆ రెండు రోజులూ నాన్నగారు ఇంటివద్దే ఉన్నారు. మూడోరోజు సాయంకాలం నాలుగు జట్కాబళ్ళు మాటాడుకొచ్చి ఇంట్లో సామానంతా వాటికెత్తించారు.

“మీరుకూడా బయల్దేరండి”అన్నారు మాతో

“ఎక్కడికి?” అంది అమ్మ ఏమీ అర్థంకాక.

“అద్దె ఇంటికి” అన్నారు నాన్న, ముఖంలో విచారం ఏమాత్రం కనబడనీకుండా.

మేము అద్దె ఇంట్లోకి వెళ్ళిన కొద్దిరోజుల్లోనే నెల్లూరులో వున్న మా మావయ్యవద్దనించి మాకు 'పెండ్లి పిలుపు' వచ్చింది. ★